పశ్చాత్తాపము

చెరుకుపల్లి శివరామయ్యగారు

౧

శారదాబిల్లు ప్రవేశించినప్పటినుంచి దేశములో పెళ్లిళ్లహడావుడులు ప్రారంభించినాయి. ఎక్కడ చూచినా తోరణాలే! ఎక్కడ చూచినా అవ్వాయిచువ్వాయిలే; ఎవరింట్లో విన్నా పెళ్లి సంబంధాలమాటలే; ఈహడావుడు అంతాచూసి రామచంద్రసోమయాజులగారు తనకుమార్తెను వివాహం చేయాలనుకున్నాడు. ఆయన ఆహితాగ్ని. మనిషి కొంచెంధూర్తుడు. పట్టుదలమనిషి కూడాను. ఆయనది బాపట్ల. ఒక్కడే కుమారుడు. యిద్దరు కుమార్తెలు. కొడుకు ఇరవై సంవత్సరములవాడు. ఎఫ్. ఏ. చదువుచున్నాడు. వానిపేరు శంకరం. పెద్దకుమార్తెఅయిన అన్నపూర్ణకు తొమ్మిది సంవత్సరము లుంటాయి. ఆపిల్లకు నిరుటిసంవత్సరమే పెళ్లిఅయింది. రెండవకుమార్తెఅయిన విశాలకి పెళ్లి కావాలె. ఆపిల్లకు రెండేళ్లు. సోమిదేవమ్మగారు గర్భిణిలో ఉన్నది. సోమయాజులగారు యిటువంటిస్థితిలో విశాలకి సంబంధంకుదిర్చేడు. కాని తల్లి కొడుకుల కిష్టంలేదు. సోమయాజులగారు ఒకనాడు రాత్రి భోజనంచేస్తూ "ఒరేయ్! అబ్బాయి! మన విశాలకి కూడా పెళ్లిఅయిందాంటె యిక్కడికి చిక్కు వదలిపోతుందిరా నాయనా! లేకపోతే వర్ణ సంకర మవుతుందేమోనని భయ మేస్తున్న" దన్నాడు.

దానితో శంకరంకు కోపంవచ్చి "నాన్నా! నీవు ముందెప్పుడో శారదాబిల్లు వస్తుందని యిప్పుడే విశాల గొంతుకోస్తావాయేమిటి? అది యింకా కన్నుతెరవలేదే; పాపం దానికి సిగ్గుతెలుసునా? మొగుడంటేయేమిటో పెళ్లంటేయేమిటో తెలియని పసిపిల్లకు పెళ్లిచేస్తానంటావే యింతకంటె అన్యాయం యెక్కడయినావుందా? నాన్నా!" అన్నాడు.

"ప్రపంచకములో అంతా పసిపిల్లలకు పెళ్లిళ్లుచేస్తున్నారాయేమిటి? యేదో ఎనిమిదియేళ్లవాళ్లకు తొమ్మిదియేళ్లవాళ్లకు చేస్తున్నారుగాని అయినా పాలుతాగేపిల్లకు పెళ్లేమిటి?" అని సోమిదేవమ్మగారు కొడుకుపక్షం మాట్లాడింది.

దానితో సోమయాజులుగారికి తారామండలమయింది. "ప్రతివిషయంలో తల్లీకొడుకూకలిసి నామాట సాగనివ్వరుగా? వాడంటే యింగ్లీషుచదివి వర్ణసంకరం కావాలెననుకుంటున్నాడు. నీకేమిరోగమే వాడిపక్షం పలుకుతావు. నీవుకూడా వానితోపాటు వర్ణసంకర మవుతావాయేమిటే? ఈ యింగ్లీషుచదువు వచ్చింది. దాంతో బ్రాహ్మణ్యం నశించచ్చింది. ఈబిల్లుతో పాతంచచ్చేరోజు వచ్చింది." అని ఉరిమినాడు.

"పోనీ యింగ్లీషు చెప్పించటం మాన్పించకపోయినారూ?"

"అదుగో: అదీ చేసేసా చేసింది? నన్ను వేధించి, వాడుంపకెంపి కొడుకు వేలు సంపాదిస్తాడని పోరుపెట్టి వాడిని యింగ్లీషులోదింపి యిప్పుడు నేరం నామీద వేస్తావుటే? యింతకు నేను జంధ్యాలు తెంపుకొని యింట్లోనుంచి లేచిపొయ్యే రోజు వచ్చింది. ఇంతకూ పెళ్లిసంగతి యేమిటే?

భర్త ధూర్తుడన్న సంగతి తెలుసుగనుక "నాకేమీ తెలియదు. తండ్రియిష్టం కొడుకిష్టం." అని సోమిదేవమ్మగారు మరిమాట్లాడలేదు.

"ఏమిరా? శంకరం!". "ఇదుగో నేనొక్క విషయం చెపుతున్నాను. నాకిష్టంలేదు; అమ్మకిష్టంలేదు. ఇటువంటిపిల్లను పెళ్లి చేశావంటే లోకం నవ్వుతుంది. కాబట్టి యిప్పుడు మానుకో. అంతగా శారదాబిల్లు వస్తే నలుగురితో పాటు మనం."

"సరే; అట్లాగయితే నేనుమాత్రం యింట్లో వుండను. జంధ్యాలు తెంపుకొని సన్యాసం పుచ్చుకుంటాను. తరువాత మీయిష్టం. వర్ణసంకరమయినా సరే: యేమయినా సరే."

"అయితే నాన్నా! ఒక వేళ మనయింట్లో యింకా రెండుమాసములకు పురుడువస్తుందే అప్పు డాడపిల్ల పుట్టుతుందనుకో యేంచేస్తావు?"

"నాజాతకంలో యికముందు పుట్టే వాళ్లంతా మొగపిల్లలే గాని ఆడపిల్లలు లేరు. రేపు పురుడువచ్చినా మొగపిల్లవాడే కాని ఆడపిల్ల కాదు. అదిమట్టుకు నిజం."

"ఒక వేళ పుట్టుతుందనుకో."

"పుట్టదురా: నాకు తెలుసు. నాజాతకచక్రం చాలామందికి చూపించేను. ఎవరుచెప్పినా యిద్దరాడపిల్లలే అని చెప్పేరు. అందుకోసం దీనికికూడా పెళ్లిచేస్తే చిక్కు వదలిపోతుందని చూస్తూంటే మీరేమో అడ్డుపుల్ల వేస్తారేమిటి?"

"అడ్డుపుల్లా లేదు. ఏమీ లేదు. నీ విప్పుడుమానుకో" అన్నాడు శంకరం.

"నేను మొన్న తాంబూలాలుకూడా పుచ్చుకొని వచ్చాను. పుచ్చుకొన్న తర్వాత మర్యాదగా వుంటుందా?"

"నాకూ అమ్మకూ చెప్పకుండా యెందుకు పుచ్చుకున్నావు?"

"నీకు చెప్పాలాయేం? బోడయ్యకు; నాయిష్టం. ఫో. లోకం నవ్వితే నవ్వింది. చేసితీరాలి." అన్నాడు.

"అష్టవర్షాభవేత్ కన్యా అని నీవే నీతులు చెప్పేవాడివి. యీ విధంగా పిల్లను పెళ్లిచేస్తే అంతా నవ్వరూ? నాన్నా! నీవుగనుక పెళ్లిచేశావంటే నేను మాత్రం పెళ్లికిరాను. ఎక్కడికో వెళ్లిపోతా" అన్నాడు.

"పోరా! పో! ఎక్కడికి వెళ్లినా సరే: ఎవరువద్దన్నా సరే పెళ్లి ఈమాసంలో జరగవలసిందే." అని అన్నాడు.

"సరే. అట్లాగయితే నే నీరాత్రే ప్రయాణం" అని శంకరం మూటముల్లె కట్టి మెయిలు రెక్కి పట్నం వెళ్లిపోయినాడు.

౨

ఇంట్లో తల్లి కొడుకుకోసం ఏడవ— పెళ్లివద్దని పోరు. కాని సోమయాజులుగారు వినలేదు. పెళ్లిప్రయత్నాలు చెయ్యవలసిందని బందరులో పెళ్లికొడుకుతండ్రి అయిన వెంకటేశ్వరసోమ

137

యాజులగారి కుత్తరం వ్రాశాడు. పెళ్ళికొడుకుపేరు మోహనం. వాడికి అయిదుయేళ్ళుంటాయి. శ్రోత్రియ విషయములో వియ్యంకు లిరువురు సమానులే కాబట్టి వెంకటేశ్వర సోమయాజులగారు పెళ్ళి కంగీకరించేరు. ముహూర్తమింకా నాలుగురోజులలో వుంది. ఈవిషయం వూరంతా గప్పుమన్నది. ఇంతవరకు ఇంతటి పసిపిల్లలకు ఎన్నడూ పెళ్ళి జరగకపోవటంవల్ల ప్రతివాడికి ఆశ్చర్యంవేసింది.

ఇరుగు పొరుగు వారంతావచ్చి "ఏమండీ! సోమయాజులగారూ! పదిమందికి బుద్ధిచెప్పవలసినవారికి మీరే యిటువంటిఘోరము చేస్తూంటే యిక మిగతాబ్రాహ్మణులసంగతి యేమిటండీ? పసిపిల్లలకు పెళ్ళి యేమిటండీ? రేపు కాపురం చేసేటప్పుడు అనుకూలదాంపత్యంకాకపోతే దాని కుత్తరవాదు లెవరండీ?" అని కాకులు తగులుకున్నట్లు తగులుకున్నారు. దానికంతా యీయన లక్ష్యపెట్టలేదు. చీవాట్లు వచ్చినాసరే పెళ్ళి కావటమేదో అది కావలసిందనుకున్నాడు. ఆడవాళ్ళంతా ముక్కుమీద వేలువేసుకొని నవ్వటం మొదలు పెట్టేరు. నవీననాగరికులంతా సోమయాజులగారిభార్య గర్భిణిలో ఉన్నది దైవం రక్షించి తిరిగి ఆడపిల్ల పుట్టిందాంటే సోమయాజులగారి తిమ్మిరి వదలుతుం దనుకుంటున్నారు. ఈ సంగతి వంగోలులోఉన్న సోమయాజులగారి బావమరిదికి తెలిసింది. ఆయన కొంచెంలౌకికుడు. ఆయనపేరు రామకృష్ణశాస్త్రి. ఆయనకు నాలుగుయేళ్ల ఆడపిల్లఉంది; కాని పిల్లకు పెళ్ళిచెయ్యటం మంచిష్టంలేక యూరకున్నాడు. ఆయనకూతురికికూడా సోమయాజులగారు సంబంధం కుదురుస్తా నన్నాడుగాని శాస్త్రిగారు వినలే. దానిమీద బావమరదంటే సోమయాజులగారికి కోపం. ఇటువంటి స్థితిలో పెళ్ళి మాన్పించటానికి రామకృష్ణశాస్త్రులగారు బాపట్ల వచ్చేరు. ఆయన యింట్లోకి వచ్చేసరికి బావగారు యింట్లోలేరు. సోమిదేవమ్మగారు తమ్ముడినిచూసి "నాయనా! కాళ్లు కడుక్కోరా!" అన్నది.

"అక్కయ్యా! కడుక్కుంటానుగాని బావ విశాలకి పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాడుట. యేమిటి?" అన్నాడు.

"అనుకోవట మేమిటిరా? నాయనా! తాంబూలాలు పుచ్చుకొనివచ్చారు. ఎల్లుండి లగ్నం" అన్నది.

ఆ సరికి శాస్త్రులగారికి కోపంవచ్చి "అక్కయ్యా! బావ చదువుకున్నా డన్నమాటేగాని యేమీ ప్రపంచం తెలియనట్లున్నది. విశాలకి పెళ్ళి యేమిటే. రామ! రామ! ఘోరం జరుగుతున్నది. శంకరం ఒప్పుకున్నాడా?" అన్నాడు.

"సరేలే: మొన్నరాత్రి తండ్రీకొడుకులకు రణయుద్ధం. దానిమీద వాడికి కోపంవచ్చి నేను యీపెళ్ళికి వుండనని అవ్వాళరాత్రే చెన్నపట్నం వెళ్లుతానని వెళ్లేడు."

"సరే: నేనుకూడా వంగోలు సాయంత్రంబండికి వెళ్ళిపోతాను. పెళ్ళికి నేనుకూడా రాను. ఎవ్వరూ రాకుండా బావపెళ్ళి యెట్లాచేస్తాడో చూస్తా." అనుసరికి సోమయాజులగారు బజారునుంచి యింట్లోకివచ్చి బావమరిదినిచూసి

"ఒరేయి! రామకృష్ణా! ఎప్పుడు వచ్చావురా?" అన్నాడు.

"ఇంతకుముందే వచ్చేను. బావా!"

"అంతా బాగున్నారా?"

"వున్నారు."

"వరేయి! కృష్ణా! విశాల పెళ్ళి యెల్లుండిముహూర్తం. నీకు యివ్వాళఉత్తరం వ్రాశామనుకొని కార్డు కూడా తీసుకొనివచ్చాను. సరే నీవే వచ్చావు. నీవు పెళ్ళి పిల్లలనువాళ్లను తీసుకొని రేపుమధ్యాహ్నానికి ఇక్కడికి రావాలి."

"బావా! విశాలపెళ్ళి చేస్తున్నావు గాని అక్కయ్య గర్భిణిలో వుందిగదా ఆమెకు ఆడపిల్ల పుట్టుతుందో మొగపిల్ల పుట్టుతుందో తెలియదు; కనుక కడుపులోవున్న పిండానికికూడా పెళ్ళి చేసేవాంటే నీకు చిక్కులు తీరిపోతవి. ఆడపిల్ల యింటాంటే మంచిది. మొగపిల్లవాడవుతే మళ్ళా పెళ్ళి చెయ్యవచ్చును." అని హేళన చేశాడు.

దానిమీద సోమయాజులగారికి తీవ్రమయిన కోపం వచ్చి "నీబోటి అప్రయోజకులు ఆక్షేపిస్తే మాత్రం నాకు లక్ష్యమనుకున్నావా యేమిరా! నీ కుమార్తెకు సంబంధం కుదిరిస్తే వద్దనిచెప్పి వర్ణసంకరం కావటానికి సిద్ధంగావున్న నీవుకూడా నన్నాక్షేపించటానికి వచ్చావా? ఆ దౌర్భాగ్యుడు వాడితో పోట్లాట పెట్టుకొని మొన్ననే యింట్లోనుంచి లేచిపోయినాడు. వాడికి పెళ్ళి చేద్దామనుకుంటే వాడికి ఇరవైఅయిదుయేళ్ళదాకా పెళ్ళి వద్దట. నే నున్నాను కాబట్టి వీళ్ళకోసం దేవులాడుతాను. నేను పోతేఅన్న మర్నాడు వీళ్ళ మొఖం ఎవడు చూస్తాడా?" అని విసుక్కున్నాడు.

"అయితే బావా! ఎవ్వరికీ ఇష్టంలేనిదానికి నీవు చెయ్యటమెందుకు?"

"నీకుగూడా యిష్టంలేకపోతే రావటం మానెయ్యి. వాడొకదేశం పోయినాడుగదా నీవుకూడా యింకోదేశం వెళ్ళు. తాంబూలాలు పుచ్చుకొని ప్రయత్నాలుజరుగుతూవుంటే యిప్పుడు మానుకోమంటా వేమిటోయ్?

"సరే నీయిష్టం." అని రామకృష్ణశాస్త్రుల్లగారు భోజనంచేసి వెంటనే రైలుకు పోవటానికి సిద్ధమయినాడు.

సోమయాజులగారు "ఏమిరా, కృష్ణా! మనపిల్లలతో రేపుమధ్యాహ్నం యిక్కడికి వస్తావా?" అని అడిగేడు.

"వీలుగావుంటే వస్తా"నని బయలుదేరేడు.

ఇంతలో వాకిట్లో సోమిదేవమ్మగారు ఎదురుగావచ్చి "నాయనా! కృష్ణా! వాడేమో చెన్నపట్నం వెళ్ళి నీవేమోరాకటంమానేస్తే యిక్కడ దిక్కెవరురా నాయనా! అయిందేమో అయింది. తోడబుట్టిన వాడివి నీవైనరాకపోతే ఎట్లాగు? రేపు తప్పక పిల్లలతో రావలసిం"దని కళ్ళనీళ్ళుపెట్టుకున్నది.

రామకృష్ణశాస్త్రుల్లగారికి నిజంగా రావాలినని యిష్టంలేదు. కాని అక్కగారి మాటలు వినేసరికి గుండె నీరైపోయింది. పాపం. ఎదురు చెప్పలేక పోయినాడు.

"అక్కయ్యా! తప్పక రేపువస్తా" నన్నాడు. వెళ్ళినాడు.

మరునాడు మధ్యాహ్నానికి రామకృష్ణశాస్త్రుల్లగారు పిల్లలతో సహా బాపట్లలో తయారయినాడు. శంకరంఅడ్రసు తెలియనందువల్ల ఉత్తరం వ్రాయలేదు. సోమిదేవమ్మగారు కొడుకు రాకపోయెనని చాలా తపించింది. పాపం. యేమిచేస్తుంది? శుభసమయంలో కళ్ళనీళ్ళుపెట్టకూడదని ఊరుకుంది.

3

బాపట్లలో వివాహం. గ్రామస్థులంతా పెళ్ళివారినిచూచి బొమ్మలపెళ్ళిళ్ళని కొందరు, తల్లిదండ్రులకు జ్ఞానములేదని కొందరు గొణుగుకోనటం మొదలు పెట్టేరు. వూరేగింపురోజు వచ్చింది. సదస్యమయిన సాయంత్రం ఊరేగింపు తలపెట్టేరు. వధూవరులను పల్లకీలో కూర్చోపెట్టేరు సోమిదేవమ్మగారు. ముందు బ్యాండు భోగంమేళంతో కోలాహలంగా వూరేగుచున్నారు. రాత్రిసమయం గనుక వధూవరులు నిద్రపాట్లలోబడి పల్లకీలోనుంచి ఎక్కడ క్రిందబడిపోతారో యని పల్లకీకి ఒకప్రక్క పెళ్ళికూతురు తల్లి ఒక

ప్రక్క పెళ్లికొడుకుఅక్క నడవటం ప్రారంభించేరు. పాపం సోమిదేవమ్మగారు గర్భిణితో ఉన్నప్పటికి కూతురుమీద మమకారంచేత నడవటం ప్రారంభించింది. పల్లకీలో కొబ్బరిబొండాలు ఖర్జూరపుపళ్లు మొదలైనవి తినుబండారాలు పెట్టేరు. ఊరేగింపుప్రారంభించేసరికి వధూవరులు పల్లకీలోఉన్న పళ్లుమొదలైనవి తినటం ప్రారంభించారు. పెళ్లికొడుకుమాత్రం ఒకటి రెండు ఖర్జూరపుపళ్లు సాధించాడు కాని పెళ్లికూతురికిమాత్రం అలవి కాలే! నవలలేకపోయింది పాపం. పెళ్లిపెద్దలంతా యీచిత్రం చూసి నవ్వటం మొదలుపెట్టేరు. బజారులో ఊరేగుతుంటే ప్రతియింటివారు వచ్చి పెళ్లి ముద్దుగా ఉన్నదనియు బొమ్మలపెళ్లిళ్లనియు ముక్కుమీద వేళ్లువేసుకోటం ప్రారంభించేరు. ఈ విధంగా కొంతదూరం వెళ్లేసరికి అక్కడ ఒకమిఠాయిదుకాణం కనిపించింది. అది పెళ్లికొడుకు చూశాడు.

“అక్కయ్యా! నాకు కారప్పూస కొనిపెట్టవే” అని కొలుపు సాగించాడు. “ఛీ” తప్పు నాయనా అనగూడ దన్నది అక్క. పెళ్లికొడుకు వింటేగా? కొనిపెట్టిందాకా ఒకటే రోదన. చివరకు పెళ్లివారిలో ఒకడువెళ్లి ఒక అర్థణా కారప్పూసపొట్లం కొనుక్కొనివచ్చేడు. దానితో యేడుపాగింది. అక్కడినుంచి పెళ్లివారు యింటిదారి పట్టేరు. ఇంతలో పెళ్లికూతురికి నిద్రవచ్చిందిగాబోలు. పల్లకీలో పడుకొని నిద్రబోయింది. పెళ్లికొడుకుగూడా కొంతసేపటికి కొకమూల కొదిగాడు. బయటనుంచి చూసేవాళ్లకు వుత్తపల్లకి ఊరేగుచున్నట్లు కనిపించింది. ప్రతియింటివాళ్లు చూసి “యేమండీ పెళ్లికొడుకు పెళ్లికూతు రేరండీ” అని అడగటం. పెళ్లివారు “పల్లకీలో పడుకొని నిద్రబోతున్నా” రని చెప్పటం. వాళ్లంతా పల్లకీ దగ్గఱకువచ్చి చూడటం. నవ్వేవాళ్లు నవ్వటం. యీవిధంగా వూరేగింపు ముగిసింది. తరువాత నాగవల్లి, మళ్లుతోరణాలు, పదహారురోజులపండుగకూడా వెళ్లిపోయినయి. చుట్టాలంతా వెళ్లిపోయినారు. రామచంద్రసోమయాజులుగార్కి మనశ్శిమితం కలిగింది. శారదాబిల్లు మనలనేమి చెయ్యదనుకున్నాడు. మహాసంతోషంలో వున్నాడు. రోజులు గడిచినాయి. సోమిదేవమ్మగారికి ప్రసవించేరోజులు వచ్చినాయి. చెన్నపట్నంనుంచి శంకరం పురుడు సంగతి, విశాలకి పెళ్లిఅయినసంగతి వ్రాయవలసిందని వంగోలుకు మేనమామ పేర ఉత్తరం వ్రాసినాడు. మేనమామ విశాలకి పెళ్లిఅయిందని పురుడింకారాలేదని ఉత్తరం వ్రాసినాడు.

౪

బాపట్లలో యిరుగుపొరుగువారంతా సోమయాజులుగార్కి కుమార్తె కలుగుతే బాగుండునని తలచేరు. ఒకనాడు సోమిదేవమ్మగారికి నొప్పులుకనిపించినాయి. యిరుగుపొరుగుఅమ్మలక్కలంతా యేశిశువు కలుగుతుందోయని పనులు కూడా చాలించుకొనిచూడటానికి వెళ్లేరు. ఇల్లంతా కిటకిటలాడిపోతున్నది. ఉదయం ఎనిమిదిగంటలయింది. సోమయాజులుగారు దొడ్లో ఆరణీసహితంగా సూర్యనమస్కారాలు చెయ్యటం మొదలుపెట్టేడు. ప్రసవించేసమయం కావచ్చింది. మంత్రసాని “యేమిటమ్మా అంతా యింట్లోకివస్తే మనిషి కూపిరాడద్దమ్మా?” అని ఆడంగులను తరమటం మొదలుపెట్టింది. ఆడవాళ్లంతా యేశిశువు కలుగుతుందో యని ఆదుర్దాలో ఉన్నారు. కొంతసేపటికి లోపలనుంచి “ఆడపిల్ల” అనేధ్వని వినిపించింది. ఇంట్లోవున్నవాళ్లంతా “ఆడపిల్ల, ఆడపిల్ల” అని కోలాహలంచెయ్యటం మొదలుపెట్టేరు. సోమయాజులుగారు నిశ్చేష్టుడయినాడు. సూర్యనమస్కారాలు గంగలో కలిసేయి. దిగులుపుట్టింది. తక్షణమే వంగోలుకు తంతియిచ్చేడు. రామకృష్ణశాస్త్రిగారు తంతిమాసుకొని చెన్నపట్నములోఉన్న శంకరముకు తంతియిచ్చాడు. మరునాడు మెయిలులో ఉభయులు యింట్లోకిదూకిపడ్డారు. తండ్రి కొడుకుతో మాట్లాడలేదు. కొడుకు తండ్రితో అంతకంటే మాట్లాడ

లేదు. రామకృష్ణశాస్త్రిగారు బావగారిని చూసి "బావా! ఆడపిల్ల పుట్టింది. శారదాబిల్లురాకమునుపే దీనికిగూడా వరుడిని కుదుర్చు" అని హేళనచేశాడు. సోమయాజులగారికి బావమరిదిని మింగుదామనేంత కోపం వచ్చింది. కాని సమయంకాదని మాట్లాడలేదు. సోమయాజులగారితిమ్మిరి బాగావదలిందని యిరుగు పొరుగువారు ఊర్లోవారు అనుకున్నారు. క్రమముగా బారసాల ఇరువైఒక్కటోరోజు వెళ్లింది. సంతోషంతో రెండుమాసాలు గడిచేయి. ఎంతఅసూయ ఉన్నను ఎంతక్రోధమున్నను ప్రపంచములో తలితండ్రులకు గర్భవాసముకన్న విలువగలవస్తువ లేదుగదా! కొడుకు మాట్లాడక పోయినప్పటికి తండ్రి కొడుకు చెన్నపట్నంనుంచివచ్చిన మరుసటిదినమునుంచే మాట్లాడటం ప్రారంభించేడు. శంకరం యేంచేస్తాడు? తండ్రిమీద కోపంవున్నప్పటికి మాట్లాడకతప్పదు. తల్లి తండ్రి కుమారుల కోపం క్షణికముగదా! కుమార్తె పుట్టిందని తల్లి కొడుకు చాలాసంతోషించేరు. కాని తండ్రి కెంతమాత్రం సంతోషంలేదు.

ఒకరోజున సోమిదేవమ్మగారు ప్రసంగవశములో "బందరునుంచి ఉత్తరంరాలేదు. ఇప్పటికి షుమారు రెండుమాసములయింది. యివ్వాళ ఒకఉత్తరమైనా వెయ్యరా. నాయనా" అని కొడుకుని హెచ్చరించింది. శంకరం వ్రాస్తానన్నాడు. తండ్రి స్నానసంధ్యాద్యనుష్టానములుదీర్చి వంటయింటిలో అగ్నిహోత్రములు చేసుకొనుచున్నాడు. పదకొండుగంటలయింది. అప్పుడు టెలిగ్రాంజవాను వీరియింటివద్దకువచ్చి వాకిట్లోనిలుచున్న శంకరమునకు టెలిగ్రాము యిచ్చివెళ్లేడు. శంకరమునకు గుండెపగిలింది. టెలిగ్రాము విచ్చిచూశాడు. అందులో మోహనంకు ప్రాణంమీదికి వచ్చింది. తక్షణమే బయలుదేరమని వ్రాసిఉన్నది. శంకరం కాళ్లు గడగడవణికినాయి. టెలిగ్రాం క్రిందకు వదిలేడు. విశాల గునగునలాడుచు పిల్లలతో బయట ఆడుకుంటున్నది. ఇంతలో తల్లి "అబ్బాయి స్నానంచేసి మడికట్టుకోరా" అంటూ వాకిట్లోకి వచ్చింది. కొడుకు మాట్లాడలేదు. ఏదో కాగితం క్రిందపడియుండటం చూసింది. "అబ్బాయీ! కాగితమేమిటి నాయనా? బందరునుంచి ఉత్తరం వచ్చిందా?" అన్నది. శంకరం మాట్లాడలేదు. ఆడుచున్న చెల్లెలివంక చూస్తూ నిలబడ్డాడు. కొంతసేపటికి కళ్లకు నీళ్లుతిరిగినాయి. తల్లికి భయంవేసింది.

"అబ్బాయి! అబ్బాయీ! యేమిటిరా? నాయనా! ఎందుకు యేడుస్తావురా? కొంపమునిగిందా యేమిరా?" అని అరిచింది.

ఈ మాట లోపలనుంచి సోమయాజులగారు విని అగ్నిహోత్రాలువదలి బయటికివచ్చి "ఏమిటే? యేమిటే?" అని ఆతురతతో భార్యనడిగాడు.

"నాకేమి తెలుసు? కాగితం క్రిందపడిఉంది. అడుగుతే వాడు చెప్పటంలేదు."

"అరే అబ్బాయి! యేమిటిరా అది?"

"టెలిగ్రాము."

"ఎక్కడనుంచి?"

"బందరునుంచి"

"ఏమని?"

"మోహనమునకు ప్రాణంమీదికి వచ్చిందని."

సోమయాజులు గారికి మనస్సు చివుక్కుమన్నది. సరాసరి దొడ్లోకి వెళ్లి కూర్చున్నాడు. విశాలకి నిష్కారణంగా గొంతుకోశాననుకున్నాడు. చీవాట్లు లోకనింద వస్తుందనుకున్నాడు. కుమార్తె జీవితం అంధకారబంధురమై పోవునా అనుకున్నాడు. పశ్చాత్తాపముచెందుటకు మొదలుపెట్టేడు.

141

ఇంతలో తల్లి "నాయనా! శంకరం! పెళ్ళిగ్రామములో యేముందో బాగాచదివి చెప్పరా?" అన్నది.

శంకరం మాట్లాడలేదు. చెల్లెలికి నిష్కారణముగా ద్రోహము చేసిన తండ్రినిగురించి విచారిస్తున్నాడు. తండ్రితో పోట్లాటపెట్టుకుందామనుకున్నాడు. కాని లాభంలేదనుకున్నాడు.

"అబ్బాయి! మాట్లాడవేమిరా? నాయనా!"

"ఏమున్నదే మోహనముకు ప్రాణంమీదికివచ్చిందని బయలుదేరి రావలసిందని ఉన్న"దన్నాడు.

ఇంతలో ఆడుకొనుచున్న విశాల "అమ్మా!" అని దగ్గఱకు వచ్చింది. తల్లి కూతురినిచేరదీసి ఒక్కపెట్టునయేడవటం మొదలుపెట్టింది. తల్లి యేడవటంతోనే పిల్లయేడవటం ప్రారంభించింది. ఇప్పుడు తల్లి కుమార్తె కేమనిచెపుతుంది? నీమొగుడికి జబ్బుగా వున్నదని చెపుతుందా? నిన్ను చూసిపొమ్మన్నారని చెపుతుందా? పాపం సోమిదేవమ్మగారు తనుయేడ్చిన కుమార్తెయేడుస్తుందని యేడవటంమాని లోలోపల కుళ్లుచూ పిల్లను చేరదీసింది.

వెంటనే సోమిదేవమ్మగారు భర్తదగ్గఱకువెళ్ళి "ముందేమిట"న్నది.

"నన్ను మాట్లాడించకే, నాకు పిచ్చియెత్తినట్లున్నది." అన్నారు.

ఆడపిల్ల పుట్టినందులకే చాలానిరుత్సాహపడుచున్న సోమయాజులుగారికి ఈవార్త చెవిని బడినంతనే స్తబ్ధుడయినాడు. కొంతసేపటికి తెలివివచ్చింది. జన్మాంతరమందు మహాపాపం చెయ్యడంవల్ల యిటువంటి యిక్కట్లు వచ్చినవని కళ్లనీళ్లుపెట్టుకున్నాడు. నావంటి పరమదుర్మార్గుడు లోకములో లేడనుకున్నాడు. పాపం. సోమిదేవమ్మగారు భర్త చాలా పశ్చాత్తాపపడుచున్నారని గ్రహించింది. ఇంతలో శంకరం దగ్గఱకు వచ్చేడు. తండ్రిని యేమీఅనలేదు.

"నాయనా! లోకమంతా చీవాట్లుపెట్టినప్పటికి స్వతంత్రించి చేసినందులకు భగవంతుడు బాగా ప్రాయశ్చిత్తము చేశాడు. నాయనా! ముందుగతి యేమిటిరా?" అన్నాడు సోమయాజులుగారు.

"ఏమున్నది? ఈ మధ్యాహ్నం నేను బందరు వెళ్లుతాను."

"నాయనా! నీవు వెళ్లుతే నీవు వచ్చేంతవరకు మాకు కాళ్లు భూమిమీద నిలవవు. మేముకూడా వస్తా"మన్నదితల్లి; కుమారు డంగీకరించేడు.

భోజనమునకు కూర్చున్నారు. కాని మెతుకైనా లోపలికి పోలేదు. ఔరా! అయిదేళ్ల కుర్రవాని కోసం యెంత తహతహపడ్డారో భగవంతునికెరుక. దీనికంతకు బాల్యవివాహమేగదా కారణం? అంతా సామాను సర్దుకొని మధ్యాహ్నంబండికి బందరువెళ్లటానికి స్టేషనుకు వెళ్లేరు. దైవ మేమిచెయ్యనున్నాడోగదా?